RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..



## రేపటి నుంచి బార్ల బంద్

ఫీజులు, ప్రివిలేజ్ సెస్ పెంపుపై నిరసన

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, అక్టోబరు 5, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 154 | పేజీలు: 8 | వెల : రూ.1

# ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కీలక ముందడుగు

### షియర్ జోన్‌ను అధిగమించి తవ్వకాల్లో వేగం..
### 2028 జూన్ నాటికి నీరు అందించేలా కార్యాచరణ



హైదరాబాద్ (వాయిస్ టుడే): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల్లో అత్యంత క్లిష్టమైన భూగర్భ పరిస్థితులను అధిగమించి కీలక పురోగతి సాధించినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన శిలల మండలం (షియర్ జోన్)ను జాగ్రత్తగా దాటడంతో సొరంగం తవ్వకాల్లో వేగం పెంచేందుకు మార్గం సుగమమైందని చెప్పారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక నీటిపారుదల ప్రాజెక్టుల అమలుపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పురోగతి, భూగర్భ పరిస్థితులు, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, అదనపు యంత్రాల వినియోగం, తవ్విన రాళ్లు, మట్టిని బయటకు తరలించే ఏర్పాట్లపై సమీక్షలో చర్చించారు.

**ఐదారు నెలల్లో 700 మీటర్ల పురోగతి**

గత ఐదారు నెలల్లో సొరంగం తవ్వకాలు సుమారు 700 మీటర్లు ముందుకు సాగినట్లు ప్రాజెక్టు అధికారులు మంత్రికి వివరించారు. అవుట్‌లెట్ వైపు సుమారు 450 మీటర్లు, ఇన్‌లెట్ వైపు 250 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. తీవ్రమైన భూగర్భ, సాంకేతిక సమస్యలతోపాటు యంత్రాల వినియోగం, తవ్విన పదార్థాలను బయటకు తరలించడంలో ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ఈ పురోగతి సాధించినట్లు వివరించారు. సొరంగం పనుల్లో మరింత వేగం పెంచేందుకు అదనపు యంత్రాలను రంగంలోకి దించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తవ్విన రాళ్లు, మట్టిని వేగంగా బయటకు తరలించే వ్యవస్థను మరింత మెరుగుపరచాలని సూచించారు. పనుల వేగంతోపాటు సొరంగంలో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

**30 టీఎంసీలకు పైగా నీరు**

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీటిని అందించి, ఏళ్ల తరబడి కొనసాగుతున్న నీటి కొరతను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. 2028 జూన్ నాటికి నీటిని అందించే లక్ష్యంతో పక్కా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

**సమీక్షలో ప్రజాప్రతినిధులు, అధికారులు**

సమీక్ష సమావేశంలో ఎంపీలు కె. రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కె. జైవీర్‌రెడ్డి, వేముల వీరేశం, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఓ.వి. రమేష్‌బాబు, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం

### కేంద్రంతో సంప్రదింపులు.. త్వరలో తీపి కబురు: పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెం (వాయిస్‌టుడే): పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లలో నిర్వహించిన కాంగ్రెస్ మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం-నల్లగొండ-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు గ్రామాలు, మండలాల వారీగా కార్యాచరణ చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా పరిష్కారం కాని భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అటవీ భూములకు సంబంధించిన కొన్ని అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున కేంద్రంతో చర్చించి పరిష్కార మార్గం కనుగొంటామని చెప్పారు. పోడు భూముల సమస్యపై త్వరలోనే ప్రజలకు తీపి కబురు అందించేలా చర్యలు తీసుకుంటామని పొంగులేటి పేర్కొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన సన్నాహాలు

## చౌటుప్పల్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సమావేశం



చౌటుప్పల్ (వాయిస్ టుడే): నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా జనసేన ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, పట్టభద్రులను కలిసే విధానం, సభ్యత్వ నమోదు, క్షేత్రస్థాయి ప్రచారంపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా జనసేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణలో సామాజిక న్యాయం, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై జనసేన నిరంతరం గళమెత్తుతుందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమకు అండగా నిలిచి, ప్రజా సమస్యలను మండలిలో ప్రస్తావించే అవకాశం కల్పించాలని కోరారు. పట్టభద్రుల ఓటర్లను విస్తృతంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గాలు, మండలాల వారీగా పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విశేష కృషి చేసిన పలువురు నాయకులు, కార్యకర్తలను ఈ సందర్భంగా సన్మానించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి మద్దతుగా ఆముదాల పరమేశ్ రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ మమ్ము రెడ్డి ప్రేమ్ కుమార్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్, శర్మ, శిరీష, ప్రజిత్ గౌడ్, మిర్యాల రామకృష్ణ, శివ కార్తీక్, లక్ష్మణ్ గౌడ్, పీక ప్రవీణ్, మామిడాల రమేశ్, శ్రీకాంత్, లింగస్వామి, బద్రి రాజు, పాండు, ప్రవీణ్ తదితరులు, జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

# తెలంగాణకు బీసీ ముఖ్యమంత్రి ఖాయం

## బీసీల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రానికి భవిష్యత్తులో బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శంషాబాద్‌లోని గొల్లపల్లి ఎక్స్‌రోడ్ వద్ద టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణ రాష్ట్రానికి ఖచ్చితంగా బీసీ ముఖ్యమంత్రి అవుతారు. ఈ విషయంలో ఘంటాపథంగా చెబుతున్నాను" అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం మాట్లాడే ధైర్యాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కల్పించారని, జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.

**కులగణనతోనే సామాజిక న్యాయం**

జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ సభలో బీసీలకు సంబంధించిన జనాభా గణాంకాలు అందుబాటులో ఉండటం సామాజిక న్యాయానికి పునాది అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం తదితర రంగాల్లో సముచిత వాటా దక్కాలంటే జనాభా ప్రాతిపదికన విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కులగణన నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించిన ఆయన, దేశవ్యాప్తంగా కూడా ఓబీసీ కులాల వివరాలను అధికారికంగా నమోదు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. జాతీయ జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్ చేర్చాలని సభ ద్వారా డిమాండ్ చేశారు.

**బీసీ ప్రాతినిధ్యం పెంచుతాం**

రాష్ట్ర మంత్రివర్గం, శాసనసభ, శాసనమండలి, వివిధ నామినేటెడ్ పదవుల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బీసీలు తమ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని, కులాల మధ్య విభేదాలను పక్కనపెట్టి సామాజిక న్యాయం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఓబీసీ సెల్ ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటల కొనుగోలుకు ముందస్తు అనుమతి ఇవ్వాలి

## కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు వినతి



అమరావతి (వాయిస్ టుడే): ఖరీఫ్-2026 సీజన్‌లో పీఎం-ఆశా పథకం కింద పండే పంటలను రైతుల నుంచి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ముందస్తు అనుమతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. కందులు, పెసలు, మినుములు, జొన్న, సజ్జ, మొక్కజొన్న, రాగి, కొర్ర, వేరుశనగ వంటి తొమ్మిది రకాల పంటల అంచనా దిగుబడిని 100 శాతం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ముందస్తు అనుమతి ఇవ్వాలని సీఎం కోరారు. రైతులకు మార్కెట్ భరోసా కల్పించడంతో పాటు, పంటలకు కనీస మద్దతు ధర అందేలా కొనుగోలు ప్రక్రియను ముందుగానే సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు.

**ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌లో మార్పులు**

కృష్ణా, కాకినాడ జిల్లాల్లో అమలు చేసిన పైలట్ ప్రాజెక్టు ఆధారంగా గుర్తించిన మార్పులను ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌లో చేర్చాలని చంద్రబాబు కోరారు. ఈ మార్పులను అమలు చేయడం ద్వారా 2026-27 రబీ సీజన్ నాటికి ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయవచ్చని కేంద్ర మంత్రికి వివరించారు.

**కిసాన్ డ్రోన్ నిధులు విడుదల చేయాలి**

ఆర్‌కేవీవై కిసాన్ డ్రోన్ కార్యక్రమానికి ఇప్పటికే ఆమోదం పొందిన రూ.52.164 కోట్ల పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ నిధులు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని 1,130 గ్రామాల్లో యంత్ర పరికరాల బ్యాంకుల ఏర్పాటు ప్రక్రియను ఎలాంటి అంతరాయం లేకుండా పూర్తి చేయవచ్చని తెలిపారు.

**మట్టి నమూనాల నిధులపై విజ్ఞప్తి**

అదేవిధంగా 5.69 లక్షల మట్టి నమూనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.10.24 కోట్ల కమిటెడ్ లయబిలిటీ నిధులను విడుదల చేయాలని కోరారు. 2026-27 సంవత్సరానికి రావాల్సిన రూ.61.97 లక్షల మిగులు కేటాయింపులను కూడా వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల కొనుగోలు, వ్యవసాయ యాంత్రీకరణ, మట్టి పరీక్షలు, డ్రోన్ ఆధారిత వ్యవసాయ సేవలకు సంబంధించిన పెండింగ్ నిధులను త్వరితగతిన విడుదల చేయాలని సీఎం కేంద్రాన్ని కోరారు.

# కేసీఆర్ తిరిగి సీఎం కావాలని యువకుల పాదయాత్ర

## మంథని నుంచి ఐదు రోజుల పాటు నడిచి ఎర్రవెల్లికి చేరుకున్న యువకులు



ఎర్రవెల్లి (వాయిస్‌టుడే): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ముగ్గురు యువకులు మంథని నుంచి ఎర్రవెల్లి వరకు పాదయాత్ర చేపట్టారు. ఐదు రోజుల పాటు పాదయాత్ర చేసిన మంథనికి చెందిన బెన్నిపాల్, బూర్ల వెంకటేశ్, కొండ వెంకటేశ్ ఆదివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. కేసీఆర్‌పై తమ అభిమానాన్ని చాటుకునేందుకు గతంలోనూ పలువురు పాదయాత్రలు, దీక్షలు నిర్వహించిన సందర్భాలను వారు గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల అంశాల్లో కేసీఆర్ పాలనలో సాధించిన పురోగతిని తాము విశ్వసిస్తున్నామని వారు తెలిపారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితే తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పాదయాత్ర చేసిన యువకులు అభిప్రాయపడ్డారు. తమ పాదయాత్ర సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలిసినప్పుడు వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలను కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. మంథని నుంచి ఎర్రవెల్లి వరకు పాదయాత్రగా వచ్చిన బీఆర్ఎస్ యువ కార్యకర్తలను కేసీఆర్ సాదరంగా ఆహ్వానించి వారితో కొద్దిసేపు మాట్లాడారు. తనపై చూపిన అభిమానానికి వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందని పాదయాత్ర చేసిన యువకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి తాము నష్టపోయామని ప్రజలు భావిస్తున్నారని, కేసీఆర్ పాలనలో అందిన సంక్షేమం, అభివృద్ధి ఫలితాలను ప్రజలు ప్రస్తుతం గుర్తుచేసుకుంటున్నారని వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతుగా ప్రజలు నిలుస్తారని పాదయాత్ర చేసిన యువకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# రేపటి నుంచి బార్ల బంద్

## ఫీజులు, ప్రివిలేజ్ సెస్ పెంపుపై నిరసన

హైదరాబాద్ (వాయిస్ టుడే): లైసెన్స్ ఫీజులు, ప్రివిలేజ్ సెస్ పెంపును నిరసిస్తూ సోమవారం (అక్టోబర్ 5) నుంచి రాష్ట్రవ్యాప్తంగా బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రకటించింది. లైసెన్స్ ఫీజును రూ.40 లక్షల నుంచి రూ.44 లక్షలకు పెంచడం, ప్రివిలేజ్ సెస్‌ను 8 శాతం నుంచి 20 శాతానికి పెంచడాన్ని అసోసియేషన్ వ్యతిరేకించింది. పెంపులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగను

# ఘనంగా నిర్వహించాలి

## జిల్లా ఖ్యాతి, కీర్తి ఎల్లలు దాటేలా వేడుకలు నిర్వహించాలి

సిద్దిపేట (వాయిస్‌టుడే): సిద్దిపేట జిల్లా ఆవిర్భావం పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు సూచించారు. జిల్లా ఖ్యాతి, కీర్తి రాష్ట్ర స్థాయిని దాటి దేశవ్యాప్తంగా చాటేలా వేడుకలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, న్యాయవాదులు, వైద్యులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో జిల్లా పదేళ్ల పండుగ నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, వివిధ రంగాల్లో జిల్లాకు లభించిన గుర్తింపు, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు వివరించేలా దశాబ్ది వేడుకలను నిర్వహించాల్సిన అవసరంపై చర్చించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, పారిశ్రామిక రంగం, మౌలిక వసతులు, ఉపాధి తదితర రంగాల్లో జిల్లాలో చోటుచేసుకున్న మార్పులను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులు, వివిధ వృత్తి సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా వేడుకలు ఉండాలని పేర్కొన్నారు. పదేళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ భవిష్యత్ లక్ష్యాలకు దిశానిర్దేశం చేసే విధంగా దశాబ్ది వేడుకలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. వేడుకల విజయవంతానికి వివిధ వర్గాల ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

# కులగణనతోనే బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులు

## షంషాబాద్‌లో టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ

శంషాబాద్ (వాయిస్ టుడే): సామాజిక న్యాయం, బీసీల రాజ్యాంగ హక్కుల పరిరక్షణతో పాటు జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ శంషాబాద్‌లోని గొల్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీసీల జనాభా ఎంత ఉందో కచ్చితంగా తెలుసుకోవడం కేవలం జనాభా లెక్కల కోసం మాత్రమే కాదని, జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో సముచిత వాటా కల్పించేందుకు కులగణన కీలకమని పేర్కొన్నారు. బీసీలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటే విధాన రూపకల్పనలో మరింత స్పష్టత ఉంటుందని నాయకులు తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే కులగణన సర్వే నిర్వహించబడిన నేపథ్యంలో, జాతీయ స్థాయిలో కూడా ఓబీసీలకు ప్రత్యేకంగా కులాల వారీగా గణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

**జనాభా ప్రాతిపదికన వాటా**

బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు దక్కాలంటే శాస్త్రీయమైన కులగణన అవసరమనే అభిప్రాయం సభలో వ్యక్తమైంది. రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల్లో సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు విశ్వసనీయమైన జనాభా గణాంకాలు అవసరమని నాయకులు పేర్కొన్నారు. జాతీయ జనగణనలో ప్రత్యేక ఓబీసీ కేటగిరీని చేర్చాలని తెలంగాణ శాసనసభ కూడా కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేసినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**పోరాటం కొనసాగుతుంది**

బీసీల హక్కుల కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. కులగణన జరగాలని, బీసీలకు న్యాయం జరగాలని, జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం సాధించే వరకు బీసీల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఒత్తిడి కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఓబీసీ సెల్ ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గాల్లోనే ఢీకొట్టిన పక్షి.. ఇండిగో విమానానికి తప్పిన పెను ప్రమాదం!

పుణె నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. విమానం గాల్లో ఉండగా ఒక పక్షి బలంగా ఢీకొట్టింది. వెంటనే అప్రమత్తమైన పైలట్ అత్యంత చాకచక్యంగా విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రయాణికులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఇండిగోకు చెందిన '6ఈ352' విమానం పుణె నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. దీంతో పైలట్ వెంటనే పరిస్థితిని అదుపులోకి తీసుకుని, ఎలాంటి ఇబ్బంది లేకుండా శంషా బాద్ విమానాశ్రయంలో విమానాన్ని దించారు. ల్యాండింగ్ అనంతరం నిపుణులు వి మానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విమానం ముందు భాగంలో సొట్ట పడినట్లు గుర్తించారు. పక్షి ఢీకొనడం వల్లే ఇలా జరిగిందని ప్రాథమికంగా నిర్ధారిం చారు. పైలట్ సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్లే పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. మరోవైపు, విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా చండీగఢ్ వెళ్లాల్సిన సర్వీసును రద్దు చేస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు ప్రకటించారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..



# విద్యా వికాసానికి ఉపాధ్యాయులే కీలకం





## హైదరాబాద్‌లో ఘనంగా ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యవర్గ సమావేశాలు.. ముగ్గురు విద్యావేత్తలకు శిక్షా భూషణ్ సత్కారం

హైదరాబాద్ (వాయిస్ టుడే): అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ కార్యవర్గ, సర్వసభ్య సమావేశాలు హైదరాబాద్‌లో మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి. "జాతీయ సంక్షేమం కోసం విద్య.. విద్యా వికాసం కోసం ఉపాధ్యాయులు.. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సమాజం" అనే లక్ష్యంతో అక్టోబరు 2 నుంచి 4 వరకు నిర్వహించిన ఈ సమావేశాలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, ప్రతినిధులు హాజరయ్యారు. నాగోల్‌లోని జీఎస్ఐలో తొలి రోజు సమావేశాలు నిర్వహించారు.

### ముగ్గురు విద్యావేత్తలకు సత్కారం

నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో అక్టోబరు 3న శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్‌ను వైభవంగా నిర్వహించారు. భారతీయ విద్యా వ్యవస్థకు విశేష సేవలందించిన ప్రొ. మామిడాల జగదీష్‌కుమార్, ప్రొ. బి. మహదేవన్, డి. రామకృష్ణారావులను త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి కరకమలాలతో ఘనంగా సత్కరించారు. ప్రొ. మామిడాల జగదీష్‌కుమార్ యూజీసీ మాజీ ఛైర్మన్, ఐఐఎం కలకత్తా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా, పద్మశ్రీ పురస్కార గ్రహీతగా ఉన్నారు. ప్రొ. బి. మహదేవన్ ఐఐఎం బెంగళూరు మాజీ ప్రొఫెసర్, డీన్, చిన్మయ విశ్వవిద్యాపీఠం వ్యవస్థాపక ఉపకులపతిగా సేవలందించారు. డి. రామకృష్ణారావు విద్యాభారతి మాజీ జాతీయ అధ్యక్షులుగా పనిచేశారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి మాట్లాడుతూ వేదవ్యాసుడే తొలి గురువు అని పేర్కొన్నారు. గురు–శిష్యుల మధ్య ఉన్న పవిత్ర బంధాన్ని వివరించారు. వశిష్ఠ, విశ్వామిత్రుల త్యాగాలను గుర్తుచేస్తూ గురువు భగవంతుని రూపమని, వేదాలకు విశిష్ట ప్రాధాన్యం ఉందని తెలిపారు. కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ సహ సర్కార్యవాహ్ సి.ఆర్. ముకుంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షుడు ప్రొ. నారాయణ్‌లాల్ గుప్తా అధ్యక్షత వహించారు.

### సంఘ నిర్మాణంపై కీలక నిర్ణయాలు

అక్టోబరు 4న జరిగిన జాతీయ కార్యవర్గ, సర్వసభ్య సమావేశానికి ప్రొ. నారాయణ్‌లాల్ గుప్తా అధ్యక్షత వహించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొ. గీతా భట్, మహేంద్ర కపూర్, గుంతా లక్ష్మణ్ తదితర జాతీయ పదాధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై చర్చించారు. ఉత్తరప్రదేశ్ తరహాలో అన్ని రాష్ట్రాల్లో బ్లాక్, మండల, జిల్లా స్థాయుల్లో సంఘాన్ని పటిష్ఠం చేయాలని నిర్ణయించారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు యూనిట్లు ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. తెలంగాణలో టాపస్ (TAPAS)ను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.





## నేర నియంత్రణ, పటిష్ట నిఘా ఏర్పాటులో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడతాయి

### - బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 4(వాయిస్ టుడే): సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ విజయదుర్గా కాలనీ (జీపీఆర్) లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చని, కాలనీలోకి వచ్చి వెళ్లే రహదారులను గుర్తించి సీసీ కెమెరా ఏర్పాటు ద్వారా సేఫ్ అండ్ స్మార్ట్ కాలనీగా విజయదుర్గ కాలనీ నిలుస్తుంది అన్నారు.వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోలీసులతో కలిసి స్ట్రాటజిక్ పాయింట్లను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీ రక్షణ మరింత బలపడుతుందన్నారు.

అదేవిధంగా రోజురోజుకు పెరుగుతున్న జనాభా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో త్రాగునీటి, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా విజయ దుర్గా కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, రాము రాథోడ్, డీఈ పాపమ్మ, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ అధికారులు, మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, విజయ దుర్గ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్యాంసింగ్, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సభ్యులు ఎస్. రాకేష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుమన్, వైయస్, బి. సందీప్, విశ్వనాథ రెడ్డి, వినోద్, శివ నాగరాజు, యుగంధర్, దుర్గాప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రవి కిరణ్, బాలాజీ నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, మధుసూదన్ రెడ్డి, చంద్రయ్య, బొబ్బ శ్రీను, పోతినేని ప్రవీణ్, యశ్వంత్, మహమ్మద్ సలీం, మహిళా నాయకురాలు లతా రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్‌లు తమ ఓటు నమోదు చేసుకోవాలి



నాగారం, అక్టోబర్ 4:–(వాయిస్ టుడే): గ్రాడ్యుయేట్ ఏమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మాజీ మంత్రివర్యులు మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి ఆధ్వర్యంలో బోయినపల్లి క్యాంప్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో సమన్వయ సమావేశ కార్యక్రమం ఆదివారం నిర్వహించడం జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కార్యక్రమంపై ముఖ్య సూచనలు చేయడం జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలంటే:

1.భారతదేశంలోని గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్/డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.

2.క్వాలిఫైయింగ్ తేదీకి కనీసం 3 సంవత్సరాల ముందు డిగ్రీ అర్హత పొందాలి.

3.మీరు ఓటరుగా నమోదు కావాలనుకుంటున్న గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో సాధారణ నివాసిగా ఉండాలి.

4.నమోదు కోసం ఫారమ్ – 18 దరఖాస్తు చేయాలి.

5.డిగ్రీ సర్టిఫికెట్/మార్క్ వంటి విద్యార్హతకు సంబంధించిన ఆధారం సమర్పించాలి.

6.గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ గా నమోదైనప్పటికీ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ గా నమోదు చేసుకోవాల్సిందే. 3 సంవత్సరాల గడువు సాధారణంగా డిగ్రీ ఫలితం ప్రకటించి ప్రచురించిన తేదీ నుంచి లెక్కించ బడుతుంది కేవలం కాన్వొకేషన్ తేదీ నుంచి కాదు. ఇంకా సులభంగా

చెప్పాలంటే కనీసం 3 సంవత్సరాల అర్హత సంబంధిత గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో నివాసం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునే అర్హత. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, చిరిమిళ్ల రాకేష్, మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, పలు మున్సిపాలిటీ ల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ రెడ్డి, కొండల్ శ్రీనివాస్ రెడ్డి, రమేష్, దయానంద్ యాదవ్, మున్సిపాలిటీ చైర్మన్లు జాము రవి, శ్రీ దేవి, కౌన్సిలర్లు, మాజీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి పథకానికి 12 ఏళ్లు



నాగారం, అక్టోబర్ 4:–(వాయిస్ టుడే): కళ్యాణ లక్ష్మి పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో మహిళలు ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సారథి, తెలంగాణ బాపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా సోదరీమణులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల నాయకులు పాల్గొన్నారు. కాగా ఉప్పల్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకం యొక్క ప్రస్థానం..

కళ్యాణలక్ష్మి పథకం తెలంగాణ రాష్ట్రం లోని నిరుపేద దళిత, గిరిజన, బీసీ, ఓబీసీ కులాలకు చెందిన యువతుల వివాహాల కోసం మరియు షాదీ ముబారక్ పథకం తెలంగాణ రాష్ట్రం లోని ముస్లిం మైనారిటీ వర్గాలకు చెందిన యువతుల వివాహాల కోసం రూ.1,00,116 చొప్పున ఆర్థిక సాయం అందించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014, అక్టోబర్ 2న ప్రవేశపెట్టిన పథకం 2017, మార్చి 13న ప్రవేశపెట్టిన 2017–18 తెలంగాణ బడ్జెట్ లో ఈ పథక ఆర్థిక సాయాన్ని రూ.51వేల నుండి రూ.75,116 లకు పెంచారు. 2018, మార్చి 19న రూ.1,00,116 కు పెంచారు. దివ్యాంగ ఆడబిడ్డలకు రూ.1,25,016 అందజేస్తోందని ఆయన తెలిపారు.

## వరుస దాడులపై సాయి శ్రవణ్ రెడ్డి ఆందోళన

### ఇంట్లో ఎవరూ లేని సమయంలో అద్దాలను ధ్వంసం



నాచారం (వాయిస్ టుడే):తనపై వరుసగా దాడులు జరుగుతున్నాయని మల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాయి శ్రవణ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత 15 రోజులుగా తాను వెళ్లే ప్రాంతాల్లో కొందరు తనను అనుసరిస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అద్దాలను ధ్వంసం చేశారని తెలిపారు. ఈ ఘటనలకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ అనుచరులు, సూర్యచంద్ర యూత్ క్లబ్ సభ్యులే కారణమని ఆయన ఆరోపించారు. ఘటనలపై నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మూడు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ విషయమై డీజీపీ సీవీ ఆనంద్, ఎల్అండ్ఓ డీజీ మహేష్ భగవత్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తనకు భద్రత కల్పించి, దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. భవిష్యత్తులో తనకు ఎలాంటి ఇబ్బంది లేదా ప్రాణహాని జరిగినా అందుకు నెమలి అనిలే బాధ్యత వహించాలని సాయి శ్రవణ్ రెడ్డి పేర్కొన్నారు.



## ఆర్టీసీ కాలనీలో ఉచిత కిడ్నీ ఆరోగ్య పరీక్షల క్యాంప్

నాగారం, అక్టోబర్ 4:–(వాయిస్ టుడే): రాంపల్లి ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆర్టీసీ కాలనీ వాసుల ఆధ్వర్యంలో సన్ సైన్ హాస్పిటల్, బేగంపేట నెఫ్రాలజీ, యురాలజర్జు విభాగాల సహకారంతో ఉచిత కిడ్నీ హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ ను ఆదివారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో చుట్టుపక్కల కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కిడ్నీ సంబంధిత ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. రాండమ్ బ్లడ్ షుగర్, సీరమ్ క్రియాటినిన్, యూరిన్ అనాలిసిస్, యూరోఫ్లోమెట్రీ వంటి పలు పరీక్షలు నిర్వహించడంతో పాటు నెఫ్రాలజిస్ట్, యూరాలజిస్ట్ వైద్యుల సంప్రదింపుల అనంతరం పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్, నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడూరు అశోక్ గౌడ్, వంగేటి పర్వత శ్రేణి, శ్రీశైలం గౌడ్, పొట్ట శీను, ప్రవీణ్ యాదవ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉచితంగా కిడ్నీ పరీక్షల క్యాంప్ నిర్వహించిన కిమ్స్, సన్ సైన్ హాస్పిటల్స్ వైద్య బృందానికి, నిర్వాహకులకు నాయకులు అభినందనలు తెలిపారు.



## రూ.72 లక్షల సిఎంసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 4(వాయిస్ టుడే ): మహదేవపురంలోని ప్లాట్ నంబర్లు 139–160, 160–171, 195–200, 194–182తో పాటు ఆర్ కే టౌన్‌షిప్ ప్రాంతాల్లో గత పదేళ్లుగా రోడ్ల నిర్మాణం లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం సిఎంసీ నిధుల ద్వారా రూ.72 లక్షలు కేటాయించింది.ఈ సందర్భంగా లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన హన్మంతన్నకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, విజయ్ రెడ్డి, వెంకట్రావు, బండారి లేఔట్ అధ్యక్షులు వరగాని వాసు, అల్లాడి మహేష్, తిరుమల, =ఖ టౌన్‌షిప్ అసోసియేషన్ మరియు కాలనీ సభ్యులు వినయ్ కుమార్, సంతోష్ అల్లెంకి, దేశాయి రెడ్డి, సతీష్ వాటికుట్టి, సురేష్ వాలంకొండ, రాజా చౌదరి, వెంకట్ ఆలపాటి, నాగరాజ్ సామల్లేటి, డాక్టర్ వెంకన్న, నాగరాజు రావూరి, కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 4(వాయిస్ టుడే): తిరుమలలోని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
సోమవారం 5 అక్టోబరు 2026

# పద్మశాలి భవన్‌లో వైభవంగా 'పద్మశాలి ఇంజనీర్స్ డే'

## అన్ని రంగాల్లో పద్మశాలీలు రాణించాలి ఎమ్మెల్సీ ఎల్. రమణ పిలుపు




హైదరాబాద్, అక్టోబర్ 04: నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి ఇంజనీర్స్ విభాగ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య అధ్యక్షతన 'పద్మశాలి ఇంజనీర్స్ డే' వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) ఎల్. రమణ మాట్లాడుతూ... పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా మరియు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించి సమాజంలో అగ్రగామిగా నిలవాలని పిలుపునిచ్చారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను ఇంజనీర్లు మార్గదర్శకంగా తీసుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. సమాజంలో మహిళల పాత్ర కీలకమని, చట్టసభలతో పాటు అన్ని రంగాల్లో వారికి 33 శాతం రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు, యువత కోసం ఉచిత కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, విదేశీ విద్యపై కౌన్సెలింగ్, మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన యువతకు పురస్కారాలు అందజేయడమే కాకుండా, పలు ఉద్యోగ ఖాళీల కోసం రెజ్యూమ్‌లను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, నాయకులు మసున మోహన్ నారాయణ, చిలుకూరి చంద్రమౌళి, చింతకింది విజయ ప్రసాద్, కస్తూరి శ్రీనివాసులు, వనం దుష్యంతల, వద్నాల శ్రీహరి, కొక్కుల దేవేందర్, గుంటక రూపా, పోరండ్ల శారద సునీత, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో గాయపడి మృతి చెందిన కార్మికుడు శివ కుటుంబానికి బాసటగా నిలిచిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

నాగారం, అక్టోబర్ 4:-(వాయిస్ టుడే) : కుషాయిగూడ ఆదర్శనగర్ డంపింగ్ యార్డులో విద్యుత్ షాక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన శివ కుటుంబానికి బాసటగా నిలిచారు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి. డంపింగ్ యార్డ్ నిర్వహకులు రామ్ కి యజమాన్యం మెడలు వంచి శివ కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. మృతుని కుటుంబానికి 50 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా, భార్యకు ఉద్యోగం, పిల్లలను చదివించే విషయంలో రాంకీ యజమాన్యం చొరవచూపి న్యాయం చేయాలని బందర్ లక్ష్మారెడ్డి డిమాండ్ చేసారు. శివ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాడుతానని, శివ కుటుంబానికి ప్రభుత్వం నుండి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.



## రంగా ప్రసాద్‌కు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు

హైదరాబాద్ : అక్టోబర్ ( వాయిస్ టుడే ): హైదరాబాద్‌కు చెందిన వర్షపు నీటి సంరక్షణ నిపుణుడు రంగా ప్రసాద్కు సస్టైనబిలిటీ విభాగంలో ప్రతిష్టాత్మకమైన ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు లభించింది. ఎ×ఉజుజ సిటీలోని ఎ×జజ కన్వెన్షన్ సెంటర్, నోవోటెల్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డా. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ జఙూ ఎం.వి. రమణ ఈ అవార్డును అందజేశారు. రంగా ప్రసాద్ 2009 నుంచి పర్యావరణ అంశాలపై పనిచేస్తున్నారు. 2016 నుంచి హైదరాబాద్‌లో వర్షపు నీటి సంరక్షణను చురుకుగా ప్రోత్సహిస్తున్నారు. ఎఎఎఝఋఅఝుతీజవర్ సంస్థ ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్ నిర్మాణాలపై పనిచేశారు. పాతబడిపోయిన, నిర్లక్ష్యానికి గురైన వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను పునరుద్ధరించి, వాటి నిర్వహణపై కూడా ఆయన ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. భవిష్యత్తులో కాలనీ వారీగా భూగర్భ జలాల రీచార్జ్ ప్రాజెక్టులు, శుద్ధి చేసిన గ్రే వాటర్‌ను భూగర్భ జలాల రీచార్జ్‌కు ఉపయోగించేలా ఫిల్ట్రేషన్‌పై పరిశోధన, అలాగే వర్షపు నీటి సంరక్షణ రంగంలో మరింత మంది నిపుణులకు శిక్షణ ఇవ్వాలని రంగా ప్రసాద్ లక్ష్యంగా పెట్టుకున్నారు. హైదరాబాద్‌లో నీటి వనరుల సుస్థిర భవిష్యత్తు కోసం ప్రజల భాగస్వామ్యంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యం కూడా ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడుతున్నార. వెబ్‌సైట్ : ఞఞ.ష్ట్రఎతీఋఅష్ట్రుతీజవర్.శీతీస్త్ర

## సోలార్ విద్యుత్ వాడకంతో పర్యావరణ పరిరక్షణ

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

నాగారం, అక్టోబర్ 4:-(వాయిస్ టుడే): ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ ను వినియోగించి నట్లయితే తక్కువ బిల్లులు, ఎక్కువ ఆదాతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. సోలార్ విద్యుత్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులను నిర్వహించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచనల మేరకు అగ్ని సోలార్ విద్యుత్ వినియోగించుకునేందుకు. మనదేశంలో వనరులు ఉన్నాయి. వాటిని వినియోగించుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సోలార్ విద్యుత్ కు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి సబ్సిడీలను వినియోగించుకోవాలని, భవిష్యత్ తరాలకు సోలార్ విద్యుత్ ఎంతో అవసరం అన్నారు. సోలార్ విద్యుత్ హబ్ గా తెలంగాణ రాష్ట్రం కావాలని ఆయన ఆకాంక్షించారు.



## బోడుప్పల్ సర్కిల్ పీరజాదిగూడలో స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో బ్రాంచ్-7 ప్రారంభం

### వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో ప్రారంభం

నాగారం, అక్టోబర్ 4:-(వాయిస్ టుడే): మల్కాజిగిరి కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పీరజాది గూడా డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో బ్రాంచ్-7 ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఫిట్‌నెస్ స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. ప్రజలకు మెరుగైన ఫిట్‌నెస్ సేవలు అందించేందుకు స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొంటూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, పీరజాదిగూడ, మేడిపల్లి డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీరాములు గౌడ్, తుంగతుర్తి రవి, కొత్త కిషోర్ గౌడ్, మాజీ మేయర్ శివ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో నిర్వాహకులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.



## కళావతికి ఎంపీ వద్దిరాజు నివాళులు

ఇనుగుర్తి: స్వర్గీయ గంజి కళావతి ప్రథమ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన పెద్దన్న కిషన్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఇనుగుర్తిలోని కళావతి కుటుంబ సభ్యుల వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళావతి భర్త రాంరెడ్డి, కుమారులు రాజేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమార్, ఉపసర్పంచ్ సత్తూరి యాదగిరి, సింగిల్ విండో చైర్మన్ ధీకొండ వెంకన్నగౌడ్, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## విద్యానగర్‌లో కే. లక్ష్మణ్ కుమార్‌కు ఘన సన్మానం

### బీజేపీ అగ్రనాయకత్వానికి చర్మకారుల కృతజ్ఞతలు

విద్యానగర్, అక్టోబర్ 04: సమగర మోచి కుల సంఘం (విద్యానగర్, అంబర్‌పేట్) ఆధ్వర్యంలో కే. లక్ష్మణ్ కుమార్ గారికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ అధిష్టానం మొదటిసారిగా చర్మకారులను గుర్తించి, కే. లక్ష్మణ్ కుమార్‌ను బిజెపి 'ఎస్సీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి'గా నియమించడంపై సమగర మోచి కుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. చర్మకార సామాజిక వర్గానికి తగిన గుర్తింపునిచ్చినందుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎల్. దీపక్ రెడ్డి, హైదరాబాద్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు అంబేద్కర్, నల్లకుంట మాజీ కార్పొరేటర్ అమృతలకు సంఘం నాయకులు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో సమగర మోచి కులసంఘం ప్రతినిధులు ఎం. సురేష్, పింజరి నర్సింగ్ రావు, రాజేందర్, కిషన్, లక్ష్మణ్ ప్రసాద్, గోవింద్, నాగప్ప, ప్రకాష్, దశరథ, మహేందర్, రవిబాబు, నాగరాజు, ప్రభురాజ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## అంబర్‌పేటలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నిరాహార దీక్ష

అంబర్‌పేట, అక్టోబర్ 04: అంబర్‌పేట నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఆదివారం అంబర్‌పేటలోని శ్రీకాంతాచారి విగ్రహం వద్ద ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షులు సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విధంగా 250 గజాల ఇంటి స్థలం, 25 వేల రూపాయల గౌరవ వేతనం, ఒక కోటి రూపాయలలో 50 శాతం రాయితీతో కూడిన రుణం మరియు గుర్తింపు కార్డులు తదితర డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే నిరాహార దీక్షకు రెండు రోజుల ముందే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ), అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) ల వద్ద అనుమతి దరఖాస్తు చేసుకున్నప్పటికీ, విధుల్లో ఉన్న ఇన్‌స్పెక్టర్ స్వయంగా వచ్చి దీక్షా శిబిరాన్ని కూల్చివేయడాన్ని జేఏసీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ దీక్షా శిబిరంలో అమరుడు శ్రీకాంతాచారి తండ్రి వెంకటాచారి, బి.వి. రమణ, రాష్ట్ర నాయకులు అన్వర్ హబీబ్, గాజుల యాదగిరి, విముక్తాకర్ మల్లేష్, జె. యాదగిరి, రాష్ట్ర నాయకురాలు కొడిపాక సత్య, బి. అమణి, లావణ్య, విజయలక్ష్మి, అనసూరి శ్రీలత, అనుముల రవీందర్, సామ్యూల్, రాజయ్య, పి. యాదగిరి, దేవానంద్, పి. నర్సింహ తదితరులు హాజరై మాట్లాడారు.

## చెత్త వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుల తయారీని ప్రోత్సహించాలి

### ఇంటి వద్ద తయారయ్యే ఎరువును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

### ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు 'ఈపీడీసీ' వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య విజ్ఞప్తి



హైదరాబాద్, అక్టోబర్ 04: పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణాల్లో చెత్త వ్యర్థాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని, నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వ్యర్థాల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ) వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య సూచించారు. వ్యర్థాలను సకాలంలో తొలగించకపోవడం వల్ల దుర్గంధంతో పాటు ప్రజలు అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో వెలువడే తడి వ్యర్థాలతో సేంద్రీయ ఎరువును తయారుచేసుకునేలా ప్రజలకు, ముఖ్యంగా గృహిణులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఇంటి వద్దే ఎరువు తయారీని ప్రోత్సహించడంతో పాటు, ప్రజలు తయారుచేసిన ఆ ఎరువును ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల స్థానిక సంస్థలకు చెత్త సేకరణ, తరలింపు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడ్డారు.

**స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ప్రాసెసింగ్ కేంద్రాలు:**

ఇంటి వద్ద ఎరువు తయారుచేసుకునే అవకాశం, స్థలం లేదా సమయం లేని వారి నుంచి తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని రంగయ్య పేర్కొన్నారు. స్థానికంగా కాలనీలు, వార్డులు, గ్రామాల స్థాయిలో శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణకు తగిన స్థలాలను కేటాయించి, సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పునర్వినియోగానికి (రీసైక్లింగ్) అనువైన వ్యర్థాలను తగిన విధంగా తరలించాలని తెలిపారు.

ఇలా తయారైన నాణ్యమైన సేంద్రీయ ఎరువును రైతులకు తక్కువ ధరకు అందించడం ద్వారా సేంద్రీయ వ్యవసాయానికి ఊతం లభిస్తుందన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో వ్యర్థాల వేర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక బుట్టలను అందించినప్పటికీ, ప్రజలు వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదని గుర్తుచేశారు. ప్రజల్లో అవగాహన పెంచి, వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక సంస్థలపై నిర్వహణ భారం తగ్గుతుందని స్పష్టం చేశారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందంటూ ప్రకటనను ముగించారు.

## చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్ సాధిస్తాం: రాజేందర్ పటేల్ గౌడ్



కాచిగూడ, అక్టోబర్ 04: చట్టసభల్లో బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్ సాధించి తీరుతామని, ఇది తమ హక్కు అని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం కాచిగూడలోని మోతీమార్కెట్‌లో గల మహాసభ కార్యాలయంలో నిర్వహించిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా ఉద్యమాలు ఎన్నడూ విఫలం కావు అని, దేశవ్యాప్తంగా జరుగుతున్న అస్తిత్వ పోరాటాలు తప్పక విజయవంతమవుతాయని అన్నారు. 10% జనాభా లేని అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించినప్పుడు, 56% ఉన్న బీసీలకు విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు రాజేష్, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాపునాడు జాతీయ అధ్యక్షులు గాళ్ల సుబ్రమణ్యానికి ఘన నివాళి



**విజయవాడ (వాయిస్ టుడే):** కాపునాడు జాతీయ అధ్యక్షులు గాళ్ల సుబ్రమణ్యం సంతాప సభ విజయవాడలోని ఏ ప్లస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, కాపు సామాజిక సంఘాల ప్రతినిధులు, నాయకులు, యువత హాజరై గాళ్ల సుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గాళ్ల సుబ్రమణ్యం కాపు సామాజిక వర్గం కోసం చేసిన సేవలను, సామాజిక ఐక్యత కోసం ఆయన నిర్వహించిన కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. సమాజంలోని వివిధ వర్గాలను కలుపుకొని ముందుకు సాగేందుకు ఆయన చేసిన కృషి, సామాజిక సమస్యల పరిష్కారం కోసం చూపిన చొరవను కొనియాడారు. కాపు సమాజంలో ఐక్యత, సామాజిక చైతన్యం, యువత భాగస్వామ్యానికి ఆయన చేసిన కృషిని పలువురు ప్రస్తావించారు. సమాజ ప్రయోజనాల కోసం నిరంతరం పనిచేసిన ఆయన సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

సంతాప సభలో కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్, ఆప్తా చందు శ్రీనివాస్, రాయల సేన ఈశ్వర్, వాయిస్ టుడే ఎండీ కొత్త లక్ష్మణ్ పటేల్, సీనియర్ జర్నలిస్ట్ రామ్మోహన్ నాయుడు, కాపు యూత్ రొక్కం శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాళ్ల సుబ్రమణ్యం కుటుంబ సభ్యులకు పలువురు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. గాళ్ల సుబ్రమణ్యం భౌతికంగా దూరమైనప్పటికీ.. కాపు సమాజం కోసం ఆయన చేసిన సేవలు, సామాజిక ఐక్యత కోసం ఆయన చూపిన చొరవ, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధత చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం, సమాజ అభ్యున్నతి కోసం ఐక్యంగా పనిచేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఆయన జ్ఞాపకాలు, సేవలు కాపు సమాజంలో ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొంటూ సంతాప సభను ముగించారు.

# ఘనంగా పుస్తక ఆవిష్కరణ, కవి సమ్మేళనం

ఖమ్మం, అక్టోబర్ 04( వాయిస్ టుడే): వికాస వేదిక సాహిత్య సంస్థ, ఖమ్మం ఆధ్వర్యంలో ఆదివారం రోజు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ప్రముఖ రచయిత డాక్టర్ కాసర్ల రంగారావు రచించిన నాలుగు పుస్తకాల పరిచయ కార్యక్రమం, కళాకారుల సన్మానం మరియు కవి సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర అధ్యక్షులు సాధనాల వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ భాష, సాహిత్యాలు సమాజ పురోగతికి మూలస్తంభాలని, అక్షర సాధన ద్వారానే సమాజంలో చైతన్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సాహిత్యం గొప్పదనం గురించి అతిధులు వికాస వేదిక సాహిత్య సంస్థ ప్రతినిధులు, గొప్పగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బుక్కా సత్యనారాయణ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కాసర్ల రంగారావు కలం నుండి జాలువారిన "భాషాంజలి" (నానేలు పరిచయం – మువ్వా శ్రీనివాసరావు, సాధనాల వెంకటస్వామినాయుడు), "తెలుగు వెలుగులు" (పరిచయం – డాక్టర్ అమ్మిశెట్టి శ్రీనివాసరాజు/అమ్మిన శ్రీనివాసరాజు), "అక్షర శిల్పాలు" (పరిచయం – యన్. తీర్థల్), "ఊర్వశితో సంభాషణలు" (పరిచయం – అవధానం రఘుకుమార్) అను 4 పుస్తకాలను ఆవిష్కరించి పరిచయం చేశారు.



అలాగే ఖమ్మం జిల్లా కళాకారుల సంఘం ఎన్నికల్లో నూతనంగా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన పొగి వెంకన్న, బొమ్మెర ముత్యంలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనానికి కోలారాములు, మలిశెట్టి కృష్ణమూర్తి, ఎస్ కె మోహినొద్దీన్, నలుబోల మధుశ్రీ, మందుల వీరభద్రం, వి. నరసింహారావు, రెంటాల చిన్న హుస్సేన్, శోభనాద్రి, హాలావత్ సీత్లా నాయక్, బి. నాగేశ్వరరావు, బి. సుశీరా, యస్.కె. మోహిద్దీన్, చింతమళ్ళ సునీత, కె. వసంత, కొత్తపల్లి కృష్ణారావు, కొంపెల్లి రామయ్య, అంగోతు జయవాసు, యం. వీర వెంకటరెడ్డి అధ్యక్షత వహించి కవితాగానం చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యాతిథులుగా డాక్టర్ కాసర్ల రంగారావు, ఎన్. కాంతేశ్వరరావు, జి. లెనిన్ శ్రీనివాస్, యడవల్లి శైలజశ్రీనివాస్, తోటపల్లి సృజన్ కుమార్, గాజుల భారతిశ్రీనివాస్, తిరునగరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను డి. శ్రీకాంత్, సిహెచ్. వీరబాబు, పి. రమేష్ బాబు, రేళ్ళ శ్రీనివాస్, గోవింద్ విజయవంతంగా నిర్వహించారు.



## ట్రస్మా మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

రాయికల్: (వాయిస్ టుడే)బీ తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాయికల్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డిని రాయికల్ ప్రెస్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ జేఏసీ అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి, విద్యాభివృద్ధికి ట్రస్మా ప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా చూడాలని, నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాజు రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య, కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు సింగని శ్యాంసుందర్, సహ కార్యదర్శి తిరుమల శంకర్, కార్యవర్గ సభ్యులు తీగుళ్ల గోపి, ఓరుగంటి భీమరాజు,కళ్లెం శ్రీనివాస్,ప్రెస్ జేఏసీ సభ్యులు అనుపురం లింబాద్రి, వాసం లింబాద్రి, ఎనుగంటి రాజు, వట్టిమల్ల గంగాధర్, మహమ్మద్ షాకీర్, గట్టుపెల్లి నరేష్,మొగిలిపాక మహేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## జహీరాబాద్‌లో తల్లిపాల కేంద్రం ప్రారంభం

**బస్‌స్టాండ్‌లో తల్లులు, శిశువుల కోసం ప్రత్యేక తల్లిపాల కేంద్రం**

**పోషకాహారంతో పసిబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం**

**తొలి వెయ్యి రోజుల్లో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ కీలకం**

జహీరాబాద్ వాయిస్ టుడే అక్టోబర్ 04: జహీరాబాద్ బస్‌స్టాండ్‌లో తల్లులు తమ శిశువులకు ప్రశాంతంగా తల్లిపాలు అందించేందుకు ఏర్పాటు చేసిన తల్లిపాల కేంద్రాన్ని జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి, మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.అనంతరం రచ్చన్నపేటలోని గౌరీ ప్యాలెస్‌లో పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగాసం.గారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. శిశువు జీవితంలోని తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పోషకాహారంతో పాటు తల్లులు, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేసి వివిధ రకాల పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సుశీల. జహిరాబాద్ తహసిల్దార్ దశరథ్, జిల్లా సమన్వయకర్త పల్లవి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల ఆర్థిక సాయం

**నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**న్యాల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి**



జహీరాబాద్, వాయిస్ టుడే, అక్టోబర్ 4: న్యాల్కల్ మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని న్యాల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేదలకు ఇళ్లు, ఆర్థిక సాయం అందిస్తూ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

## జహీరాబాద్‌లో నిరుద్యోగులకు ఉచిత కోచింగ్

**పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ.. ఉచితంగాస్టడీ మెటీరియల్ పంపిణీ**



జహీరాబాద్, వాయిస్ టుడే, అక్టోబర్ 4: జహీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ తరగతులు. నిర్వహించనున్నట్లు జహిరాబాద్ ఎస్ఐ లవకుమార్ తెలిపారు. ఎస్పీ పరితోష్ పంకజ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 7వ తేదీ వరకు పోలీస్ స్టేషన్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 10 నుంచి రెగ్యులర్ కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పోలీస్ సిబ్బంది, ఫెసిలిటేటర్ల సహకారంతో అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జహిరాబాద్ఎస్ఐ. లవకుమార్ సూచించారు.

## సింగూరు బ్రిడ్జిపై సినిమా షూటింగ్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం

షూటింగ్ నిర్వాహకులకు పోలీసుల సూచనలు.. ట్రాఫిక్‌ను పునరుద్ధరించిన సిబ్బంది

పుల్కల్ (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టు బ్రిడ్జిపై సినిమా షూటింగ్ జరుగుతుండటంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో బ్రిడ్జిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో చిన్నారులతో ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సమాచారం అందుకున్న ఎస్ఐ విశ్వజన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. షూటింగ్‌కు సంబంధించి అవసరమైన అనుమతులపై నిర్వాహకులను పోలీసులు ఆరా తీశారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో షూటింగ్‌ను నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. భవిష్యత్‌లో సంబంధిత అనుమతులు, నిబంధనలు పాటిస్తూ షూటింగ్ నిర్వహించాలని నిర్వాహకులకు ఎస్ఐ విశ్వజన్ సూచించారు. ప్రజా రాకపోకలకు అంతరాయం కలిగే పరిస్థితులు పునరావృతమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## HOUSEFED నూతన డైరెక్టర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు

హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ (ట్గా నూఖూజుఖీజుణ) ఎన్నికల్లో అధికార పార్టీ బలపరిచిన ప్యానల్ విజయం సాధించిన సందర్భంగా నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు ముదిగంటి శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మాండభేరి గోపరాజు, పట్లోళ్ల శంకర్ రెడ్డి, అంకినేడు ప్రసాద్‌లను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫెడరేషన్ అభివృద్ధికి, హౌసింగ్ సొసైటీల సంక్షేమానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సహకారంతో ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేసి, కోఆపరేటివ్ హౌసింగ్ రంగానికి కొత్త దిశ చూపేలా నూతన డైరెక్టర్లు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు



ఖమ్మం , అక్టోబర్ 4 ( వాయిస్ టుడే): ఖమ్మం పట్టణ దాస్ ఆంజనేయ స్వామి దేవస్థానం చెరువు బజార్లో వేయించేసి ఉన్న మహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 11వ తేదీ నుండి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో, అర్చకులు ఎన్ కృష్ణ ఫణి పర్యవేక్షణలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ దినాలలో అమ్మవారిని, వివిధ అలంకారాలతో విశేషంగా అలంకరిస్తారు. ప్రతిరోజు అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ జరుగుతాయి. పవిత్రమైన ఈ దినాలలో అమ్మవారిని మొదటగా బాలా త్రిపుర సుందరి , అన్నపూర్ణాదేవి, గాయత్రీ దేవి, కాత్యాయనీ దేవి, లలితా త్రిపుర సుందరి, సరస్వతి దేవి, మహాలక్ష్మి దేవి, దుర్గాదేవి, మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరి దేవి అలంకారాలతో భక్తులకు అమ్మవారి దర్శనం ఇవ్వనున్నారు. పవిత్ర దినాలలో భక్తులు తలలివచ్చి అమ్మవారు ని సేవించి, కృపకు పాత్రులు కావాల్సిందిగా, ఆలయ కార్య నిర్వహణ అధికారి హరి చంద్రశేఖర్, చైర్మన్ ఎం. హరిత సైదారావు , అర్చకులు, ధర్మకర్తల మండలి, దేవస్థానం సిబ్బంది కోరారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారమే పోషకాహారం అందించాలి

**ఆయా పోస్టులు భర్తీ చేయాలి.. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలి**

**బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాలరెడ్డి**

కరీంనగర్, రేకుర్తి (వాయిస్ టుడే): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారాన్ని తప్పనిసరిగా అందించాలని బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాలరెడ్డి కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సుపరిపాలనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా నిర్వహిస్తున్న అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా రేకుర్తి 20వ డివిజన్ విజయపురి కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జాడి బాలరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, గర్భిణీల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ పోషకాహార కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కేంద్రం నుంచి అందుతున్న పోషకాహారాన్ని అంగన్వాడీ నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ, పట్టిక ప్రకారం లబ్ధిదారులకు అందించాలని సూచించారు.

### ఆయా పోస్టులు భర్తీ చేయాలి

అంగన్వాడీ కేంద్రాల్లో ఆయాలు లేకపోవడంతో చిన్నారులకు వంట చేసి ఆహారం అందించడంలో అంగన్వాడీ టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాలరెడ్డి తెలిపారు. ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

### అంగన్వాడీలకు సొంత భవనాలు నిర్మించాలి

చాలా అంగన్వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు పక్కా సొంత భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉత్సవాల కో-కన్వీనర్ జుట్టు మమత, బూత్ అధ్యక్షులు గోదా నరేష్, పరశురాములు గౌడ్, కనకలక్ష్మి, గోలి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

మిర్యాలగూడ అక్టోబర్ 4 (వాయిస్ టుడే ) మిర్యాలగూడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మిర్యాలగూడ పట్టణం రెడ్డి కాలనీలోనిబి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు హాజరై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మిర్యాలగూడ పట్టణంలోని 48 వార్డుల్లో ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడికి ఓటు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జ్‌లు, ముఖ్య నాయకులు తమ తమ వార్డులలో పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రతి వార్డులో నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పార్టీ



కార్యాలయంలో ఇద్దరు డాటా ఎంట్రి ఆపరేటర్ లను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు.. మీరు ఆన్లైన్ వివరాలను పంపిన దరఖాస్తులను చేస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. పట్టభద్రుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం బలమైన గొంతుకగా నిలిచే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తన ఓటును నమోదు చేసుకోవాలని భాస్కర్ రావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి,ఎండి.ఇలియాస్ ఖాన్,పెద్ది శ్రీనివాస గౌడ్,ఎండి.మగ్దూం పాషా, ఎండి.మాజీద్, పద్మశెట్టి కోటేశ్వర రావు,పెండ్యాల పద్మావతి, షెహనాజ్ బేగం,కుర్ర చైతన్య,మాలి రేణుక,దైద సత్యం, దీపిక విజయ్,లావూరి సుధాకర్,సందేషి అంజన్ రాజు, మర్రి అంజిబాబు,తిరుమలగిరి వజ్రం,వడ్డేపల్లి శ్రీను, జన్నపాల కిరణ్, ఎర్రమల్ల దినేష్,పునాటి లక్ష్మీనారాయణ, కోలా రామస్వామి, ఖలీల్, చిమట వెంకటరాములు, పల్నాటి జానకిరేడ్డి, భూక్యా రాంబాబు, రేదబోతు సంతోష్ రెడ్డి, రామావత్ చంటి, తిరుపతిరావు, సీతారాములు, పశ్యా శ్రీనివాస్ రెడ్డి, మన్నెం శ్రీనివాస్ రెడ్డి, గంట శ్రావణ్ రెడ్డి,వల్లపట్ల వినోద్,గుడుగుంట్ల గణేష్,కందగట్ల అశోక్,పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్,పందిరి వేణు,నారబోయిన నాగరాజు,షేక్ మస్తాన్, దోనేటి సైదులు,చాంద్ ఖలీల్,నునే రవి కుమార్,మండలోజు సైదా చారి,శిరసనగాండ్ల ఈశ్వర్ చారి,నేరెళ్ళ రవి,నేరెళ్ళ శివ,కనకయ్య,దైద వెంకటేష్,పూర్ణచంద్ర రావు, ఎక్క మనిదీప్,నర్ర ముకేష్ చౌదరి,గయాస్,అలీం రుక్షన,చిట్టిపోలు వెంకటేశ్వర్లు, రాజు,కృష్ణ రాజు ,అలీమోద్దిన్,నరసింహ, 48 వార్డులకు చెందిన పార్టీ వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలులి పాల్గొన్నారు

వాయిస్ VOICE OF PRAJALU

హైదరాబాద్
సోమవారం 5 అక్టోబరు 2026



## లక్షల డప్పులు వేల గొంతులు కార్యక్రమంలో డప్పుల బహుకరణ

తొర్రూరు, అక్టోబర్ 4 వాయిస్ టుడే : తొర్రూరు మండలం గుర్తూరు గ్రామానికి చెందిన తాటికాయల లక్ష్మి కొమురయ్య జ్ఞాపకార్థం గుర్తురు గ్రామానికి పది డప్పులు తాటికాయల సురేందర్ పద్మ వారి అమ్మానాన్నల జ్ఞాపకం డబ్బులు ప్రధానం చేయడం జరిగింది. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి ఉద్యోగస్తులు వారి యొక్క నివాసం ఉన్నటువంటి గ్రామానికి డ్రప్పులు ప్రధానం చేయడం జరుగుతుంది అందులో భాగంగా తాటికాయల సురేందర్ పద్మ నా పుట్టిన ఊరుకు కులానికి డప్పులు స్పాన్సర్ చేయాలని ఆలోచన చేసి మంచి మనసుతో పది డప్పులను పంచడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంఈఓ మాంకాలి బుచ్చయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు తాటికాయల సురేందర్ పద్మ వారు పుట్టిన ఊరుకు పది డబ్బులు ఇవ్వడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్తూరి పూర్ణచందర్ మాదిగ జర్నలిస్టుల ఫోరం జిల్లా అధ్యక్షులు. అందే శేఖర్, ఏర్పుల మహేందర్, చింత భాస్కర్, బొర్ర శంకర్, వెల్తురు యాకయ్య, ఈదునూరి ఎల్లయ్య,, వెల్తురు కార్తీక్, ఏర్పుల చంద్రయ్య, ఈదునూరి మధు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పందుల విజయ్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు బచ్చలి వెంకన్న రాయిశెట్టి ఉపేందర్ బందు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## కష్టాల్లో ఉన్న ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండ

### అనారోగ్యంతో బాధపడుతున్న మూల నాగరాజు వర్మకు ఆర్థిక సాయం

### కేటీఆర్ ఆదేశాలతో పరామర్శించిన దాస్యం వినయ్ భాస్కర్

కాజీపేట, అక్టోబర్ 04(వాయిస్ టుడే): కష్టాల్లో ఉన్న తమ కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మడికొండకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మూల నాగరాజు వర్మ అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విషయాన్ని సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన కేటీఆర్ నాగరాజు వర్మను పరామర్శించి అవసరమైన సహాయం అందించాలని దాస్యం వినయ్ భాస్కర్‌ను ఆదేశించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు వినయ్ భాస్కర్ నాగరాజు వర్మ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను తెలుసుకుని ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నాగరాజు వర్మ ఆరోగ్య పరిస్థితిపై వైద్యుడితో ఫోన్‌లో మాట్లాడిన వినయ్ భాస్కర్, మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, పోలేపల్లి రామ్మూర్తి, గంద్రకోట రాకేష్ యాదవ్, తక్కెళ్లపల్లి వినీల్ రావు, సుధాకర్, తిరుపతి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

### ఓటు హక్కును కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత

### ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుంది

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హనుమకొండ, అక్టోబర్ 04(వాయిస్ టుడే): కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు డిమాండ్ చేశారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలు, ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు పునాది వంటివని, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత అని నాగరాజు అన్నారు. ఓటు హక్కుపై ప్రజల్లో అనుమానాలు కలిగితే వాటిని ఎన్నికల సంఘం నివృత్తి చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 7న పోచమ్మ మైదాన్ నుంచి హనుమకొండ అంబేద్కర్ వరకు అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కండి

### వ్యాయామం మన జీవన విధానం కావాలి

### ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



మానకొండూర్/హైదరాబాద్,అక్టోబర్ 04 (వాయిస్ టుడే):ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు.ఆరోగ్యాన్ని కాపాడుకుంందుకు వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు.హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర క్రీడా శాఖ,తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏటీజీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో తెలంగాణ బంధన్ ఛాలెంజ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి పాల్గొని ప్రసంగించారు.ఆరోగ్యమే మహా భాగ్యమని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామానిక ి ప్రాధాన్యమివ్వాలని అన్నారు.రోజుకు కనీసం 30 నిమిషాల పాటు నడక, పరుగు,వ్యాయామం,యోగా, ధ్యానం లేదా తమకు ఇష్టమైన ఏదైనా క్రీడకు కేటాయించాలని సూచించారు. క్రీడలు,వ్యాయామం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. అన్ని వయసుల వారు ఖేలో తెలంగాణ బంధన్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఖేలో తెలంగాణ బంధన్‌లో భాగంగా 27 సెకన్ల వ్యాయామ రీల్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేసి,మరో తొమ్మిది మందిని ఈ ఛాలెంజ్‌కు ఆహ్వానించాలని కవ్వంపల్లి సూచించారు. ప్రజలంతా ఈ ఛాలెంజ్‌ను స్వీకరించి క్రీడలు,వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ క్రీడా ఉద్యమంలోభాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్, డీసీపీ, ఏసీపీలు, జిల్లా లైబ్రరీ చైర్మన్,కరీంనగర్ మేయర్ తదితరులు ఖేలో తెలంగాణ బంధన్ ఛాలెంజ్‌ను స్వీకరించి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్లు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూడా ఈ క్రీడా ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మానకొండూర్ నియోజకవర్గంలో విద్యార్థులు,యువతను క్రీడల వైపు మరింతగా ఆకర్షించేలా ఖేలో తెలంగాణ బంధన్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు,పీఈటీలు,క్రీడా సంఘాలు, స్థానిక యువజన సంఘాలను భాగస్వామ్యం చేస్తామని ఆయన పేర్కొన్నారు.



## బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా గుగులోతు తిరుపతి నాయక్

కరీంనగర్,అక్టోబర్ 04(వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గుగులోతు తిరుపతి నాయక్ నియమితులయ్యారు.ఈ మేరకు బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి ఎంతగానో సహకరించి,ఆశీస్సులు అందించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్,బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు సూచనల మేరకు,తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్, సహకరించిన బిజెపి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా,గిరిజన తండాలు గూడేలు ఎదుర్కొంటున్న సమస్యలపై, బిజెపి ఎస్టి మోర్చా బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని చెప్పారు.భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తూ,పార్టీ అప్పగించిన బాధ్యతలను సర్ధకతతో నిర్వహిస్తానని పునరుద్ఘాటించారు.

## ప్రశాంతంగా కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

### ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్,అక్టోబర్ 04 (వాయిస్ టుడే): జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు అత్యంత ఉత్సాహంగా,ప్రశాంత వాతావరణంలో జరిగాయి.ఈ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ శాసనసభ్యులు,రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ పోలింగ్ కేంద్రానికి స్వయంగా విచ్చేసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమాజంలో రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లే నూతన పాలకవర్గ ఎంపిక కోసం జరుగుతున్న ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఈ పోలింగ్ ప్రక్రియలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు,రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొని తమ ఓటు హక్కును చాటుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## కరీంనగర్ వన్ బస్ డిపో గౌరవ అధ్యక్షులుగా వైద్యుల అంజన్ కుమార్

### 2 డిపో గౌరవ అధ్యక్షులుగా రాచకొండ చక్రధర్ రావు ఏకగ్రీవ నియామకం



కరీంనగర్,అక్టోబర్ 04 (వాయిస్ టుడే): కరీంనగర్ వన్ బస్ డిపో గౌరవ అధ్యక్షులుగా వైద్యుల అంజన్ కుమార్,టు డిపో గౌరవ అధ్యక్షులుగా రాచకొండ చక్రధర్ రావు ను కాంగ్రెస్ అనుబంధ సంస్థలైన ఐ.ఎన్.టియు సి,ఎస్.డబ్ల్యూ.యు, టి.డబ్ల్యూ.యు,ఎస్.డబ్ల్యూ.ఎఫ్, యూనియన్ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకన్నారు.ఈ సందర్భంగా అంజన్ కుమార్,రాచకొండ చక్రధర్ రావు మాట్లాడుతూ అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంద సంస్థ నుండి పోటీ చేసే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు బహుమతిగా ఇవ్వాలని అన్నారు.కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకువస్తే మంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.ఈ సమావేశంలో నాయకులు టి.ఆర్.రెడ్డి,రాజు, ఐ.ఎన్.టియు.సి,ఎస్.డబ్ల్యూ.యు,టి.డబ్ల్యూ.యు,ఎస్.డబ్ల్యూ.ఎఫ్,కి చెందిన నాయకులు మరియు వన్,టూ,డిపోలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## బీరు సీసాతో దాడి.. వ్యక్తికి తీవ్ర గాయాలు



చిగురుమామిడి, అక్టోబర్ 4 (వాయిస్ ఆఫ్ ప్రజలు): చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో శనివారం జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాసరి సాగర్‌రెడ్డికి తలకు తీవ్ర గాయమై, రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రేకొండ గ్రామానికి చెందిన పంకెర్ల రాజు, దాసరి సాగర్‌రెడ్డి మధ్య జరిగిన ఘర్షణలో రాజు బీరు సీసాతో సాగర్‌రెడ్డిపై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో సాగర్‌రెడ్డి తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. గాయపడిన సాగర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంకెర్ల రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. ఘటనకు దారితీసిన కారణాలు, ఘర్షణకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

### కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి



మాదుగులపల్లి : అక్టోబర్ 4 (వాయిస్ టుడే )మండల పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు నమోదు కోసం సెప్టెంబర్ 28, 2026 నుంచి నవంబర్ 6, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఓటు నమోదు చేసుకునే పట్టభద్రులు పూర్తి వివరాలతో ఫారం--18 దరఖాస్తుతో పాటు 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత పొందినట్లు నిర్ధారించే కాన్వొకేషన్ లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, సాధారణ ఓటర్ ఐడీ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, మొబైల్ నంబర్ సమర్పించాలని సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని గడ్డం వేణుగోపాల్ రెడ్డి కోరారు

## అంతర్జాతీయ విద్యా సదస్సుకు ట్రస్మా గౌరవ యాదగిరి శేఖర్ రావుకు ప్రత్యేక ఆహ్వానం



కరీంనగర్,అక్టోబర్ 04 (వాయిస్ టుడే): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు,వ్యవస్థాపక సభ్యుడు,ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షుడు,కరీంనగర్‌లోని వాల్మీకి,నందిని పాఠశాలల చైర్మన్ యాదగిరి శేఖర్ రావుకు అంతర్జాతీయ స్థాయి విద్యా సదస్సులో పాల్గొనడానికి ప్రత్యేక ఆహ్వానం అందింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో అక్టోబర్ 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న ఎడ్ లీడర్షిప్ ఇంటర్నేషనల్ రౌండ్ టేబుల్-2026 సదస్సును నిర్వాహకులు అధికారికంగా ఆహ్వానించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యారంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు,కృత్రిమ మేధస్సు ప్రభావం, భవిష్యత్ విద్యా విధానాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చలు జరగనున్నాయి.ఈ ఏడాది సదస్సు ప్రధాన అంశంగా ఏం సమాధానం చెబుతుంది,మీ పిల్లవాడు ప్రశ్నించగలడా? ఏఐ యుగానికి అనుగుణంగా పాఠశాలల పునర్నిర్మాణం అనే థీమ్‌ను ఎంపిక చేశారు.సదస్సులో ప్రత్యక్ష తరగతి గది ప్రదర్శనలు,ఏఐ ఆధారిత బోధనా విధానాలపై శిక్షణ కార్యక్రమాలు,విద్యా నాయకత్వ చర్చలు, అంతర్జాతీయ విద్యావేత్తలతో పరస్పర అనుభవాల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.తెలంగాణ రాష్ట్రం నుంచి విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న నాయకుడిగా యాదగిరి శేఖర్ రావుకు ఈ ఆహ్వానం లభించడం రాష్ట్ర ప్రైవేట్ విద్యారంగానికి గర్వకారణమని విషయంగా విద్యావేత్తలు,పాఠశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ విద్యా రంగ ప్రతినిధిగా ఆయన పాల్గొనడం ద్వారా రాష్ట్ర విద్యా వ్యవస్థలో అమలవుతున్న ఉత్తమ విధానాలు,అనుభవాలు ప్రపంచ విద్యావేత్తలకు పరిచయం అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, టీఆర్ఎస్ఎంఏ నాయకులు యాదగిరి శేఖర్ రావుకు అభినందనలు తెలియజేశారు. తెలంగాణ ప్రైవేట్ విద్యారంగ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచే అవకాశంగా ఈ సదస్సు నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఐపీఎస్‌లో ఉత్కంఠభరితంగా థాంగ్-టా పోటీలు



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా అక్టోబరు-04 వాయిస్ టుడే: స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల వేదికగా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. పోటీలను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, కరీంనగర్ జిల్లా థాంగ్-టా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వికాస్ కుమార్, చందు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేసి ఉన్నతస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మ్యాచ్ రెఫరీలు లింగమూర్తి, గణేష్, కోచ్‌లు,వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, కుమార్, విష్ణు, సుష్మా రెడ్డి, విజయ్, వెంకటేష్, రాకేష్, వినయ్, సత్యం,శివ , సతీష్, రణధీర్, క్రీడాకారులు పాల్గొన్నారు..



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నర్సాపూర్ : నర్సాపూర్ కేంద్రమైన డి జే హై స్కూల్ 1993 1994 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నర్సాపూర్లో ఆదివారం నాడు ఘనంగా జరుపుకున్నారు ఈ సమావేశం ఏర్పాటు చేసుకొని ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులు చేసుకున్నారు పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కొన్ని సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకొని ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనాడు చదువు చెప్పిన గురువుల క్రమశిక్షణతో పాటు నేడు వివిధ స్థాయిలో స్థిరపడి చిన్ననాటి చిలిపి గుర్తులను వేసుకుంటూ ఆనందంగా గడిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు జయంతి వేడుకలు

రాయికల్ ( వాయిస్ టుడే): రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు వ్యవసాయ కమిటీ చైర్మన్ కొండపెల్లి రవీందర్ రావు గారు మాట్లాడుతూ, జువ్వడి రత్నాకర్ రావు ప్రజల పట్ల అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. అనంతరం పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల శ్రీనివాస్ రాజేందర్ ,ఆత్మ కమిటీ ఛైర్మన్ గంగిరెడ్డి ,కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,కో ఆప్షన్ ఇర్ఫాన్, సూదవేణి మురళి,జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బొద్దుల శివ కుమార్ , సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,కొత్తపెల్లి గోపాల్ , బాపురపు నర్సయ్య,కటకం రాజేశం, ఆడెపు లక్ష్మీ నారాయణ,కొల శ్రీనివాస్,మరిపెల్లి శ్రీనివాస్, గుజ్జల మోహన్ రెడ్డి ,లింగన్న,మహేందర్ బాబు ,గట్టుపెల్లి నరేష్ , కటుకం రాజేశం ,ఆడెపు లక్మి నారాయణ , కొట్టురి రవీందర్ రావు, యూత్ నాయకులు పడిగేలా నరసింహ ,కసావేని రాజేష్ మ్యాకల కాంతారావు,జలపతి తదితరులు పాల్గొన్నారు

# నేడు మండలంలోనీ బాధితులను పరామర్శించనున్న మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 04: తానూర్ మండలంలోని కోలూర్, జవుల(కె), ఎల్వి, ఝరి(బి) తదితర గ్రామాల్లోని పలువురు బాధితులను పరామర్శించడానికి, ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణరావు పటేల్ నేడు సోమవారం ఉదయం 11 గంటలకు వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హెచ్. పుండ్లిక్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా, ఆయన బాధితులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇవ్వనున్నారని పుండ్లిక్ పేర్కొన్నారు.ఈ పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, సర్పంచులు, బూత్ కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హచ్ పుండ్లిక్ తెలిపారు.

# శ్రీనివాసును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఉదయభాను



కోదాడ ,అక్టోబర్ 4 (బ్యూరో చీఫ్ వైవి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కందికొండ శ్రీనివాస్ ను కోదాడలోని వారి స్వగృహం నకు వచ్చి పరామర్శించిన కృష్ణాజిల్లా జనసేన అధ్యక్షుడు జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పసుపులేటి రామారావు, భార్గవ్ ఏనే, మొలుగూరి సైదులు,రౌతు కళ్యాణ్,కోలపాటి వెంకటేశ్వరరావు, పొన్నం ఏసు తదితరులు కుల పెద్దలు పాల్గొన్నారు

# రోడ్లపై పంటలు ఆరబెట్టవద్దు

## ప్రమాదాలకు అవకాశం రైతులు సహకరించాలి: తానూర్ ఎస్సై షేక్ జుబేర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 05: తానూర్ మండలంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులపై పంటలను ఆరబెట్టవద్దని ఎస్సై షేక్ జుబేర్ రైతులకు సూచించారు. పంట కోతలు పూర్తవుతున్న నేపథ్యంలో పలువురు రైతులు రోడ్లపై ధాన్యం, ఇతర పంటలను ఆరబెడుతున్నారని తెలిపారు.రోడ్లపై పంటలను ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డుపై ఉన్న పంటలను తప్పించుకునే క్రమంలో వాహనదారులు ఒక్కసారిగా వాహనాలను మళ్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో రోడ్లపై ఆరబెట్టిన పంటలు స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఇతర వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు.అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, ఇతర అత్యవసర వాహనాలు వేగంగా వెళ్లేందుకు రహదారులపై ఆరబెట్టిన పంటలు ఆటంకంగా మారుతాయని తెలిపారు. రైతులు తమ పంటలను రహదారులకు దూరంగా, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగని ప్రదేశాల్లో ఆరబెట్టుకోవాలని సూచించారు.రైతుల పంటలకు నష్టం కలగకుండా, అదే సమయంలో ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై షేక్ జుబేర్ కోరారు. రహదారి భద్రత విషయంలో రైతులు, గ్రామ ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

# మామడలో ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 05: మామడ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకెట పోశెట్టి చేతుల మీదుగా చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మామడ సర్పంచ్ పందిరి చంద్రకళ సురేందర్, ఉపసర్పంచ్ గోవర్ధన్, రజక సంఘం గౌరవ అధ్యక్షులు సహదేవ్, అధ్యక్షులు ఏటీ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఒడ్నాల రాజేశ్వర్, కొండూరు గంగన్న, వై. సురేష్, చందుల రాజు, మామడ మండల రజక సంఘం సభ్యులు, మాజీ ఎంపీటీసీ బాపయ్య, ఆరిఫ్ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికార సంకల్ప సభను విజయవంతం చేయండి

బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 04 నిర్మల్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం గారి 20వ వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 9న ఆదిలాబాద్ రెవెన్యూ గార్డెన్ నందు నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సంకల్ప సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే, బహుజనుల విద్య, సామాజిక సమానత్వం కోసం పోరాటానికి బాటలు వేశారని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ హక్కుల కోసం విశేష కృషి చేశారని తెలిపారు. ఆ మహనీయుల ఆలోచనలను రాజకీయ చైతన్యంతో ముందుకు తీసుకెళ్లిన మాన్యశ్రీ కాన్షీరాం బహుజనులను సంఘటితం చేసి రాజ్యాధికార లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు.

పూలే, అంబేద్కర్, కాన్షీరాం గారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మరియు అణగారిన వర్గాలు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ నియోజకవర్గం సారంగాపూర్ మండలంలోని ప్యారమూర్, బీరెల్లి, సారంగాపూర్ గ్రామాల్లో బహుజన రాజ్యాధికార సంకల్ప సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అక్టోబర్ 9న ఆదిలాబాద్ రెవెన్యూ గార్డెన్ నందు నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సంకల్ప సభకు బహుజన సమాజ ప్రజలు, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు: జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీ యాదవ్, నిర్మల్ నియోజకవర్గం అధ్యక్షులు క్యాతం సాగర్, రాజేష్, దత్తు, సాగర్, సునంద తదితరులు మరియు మహిళలు పాల్గొన్నారు.



# జగిత్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

## కార్యక్రమంలో పాల్గొన్న అవోపా జగిత్యాల జిల్లా శాఖ కమిటీ సభ్యులు

ధర్మపురి, అక్టోబర్ 04 (వాయిస్ టుడే) : జగిత్యాల జిల్లాలోని జగిత్యాల పట్టణ కేంద్రంలో గల స్థానిక సమావేశ మందిరం యందు నిర్వహించిన సమావేశం నందు జగిత్యాల జిల్లా శాఖ ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు రాజేషుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో.. ఆదివారం రోజు మధ్యాహ్నం వేళలో తెలంగాణ రాష్ట్ర స్థాయి, జగిత్యాల జిల్లా స్థాయి, జగిత్యాల జిల్లాలోని మండల స్థాయిలో (2026) ఉత్తమ ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల అవార్డులు అందుకున్న ఆర్య వైశ్య ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో పాటు, అవోపా ధర్మపురి మండల శాఖ ప్రతినిధులకు జ్ఞాపిక అందజేసి శాలువా కప్పి ఎంతో ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, కూరగాయల చంద్ర శేఖర్, గంప విద్యా దేవి, దోంతుల శ్రీధర్, నాగ మల్ల శ్రీత లతో పాటు, అవోపా ధర్మపురి మండల శాఖ ప్రతినిధులు జక్కు రవీందర్, రంగ శ్రీనివాస్, జోన్నల వీరేషం, అక్కన పెల్లి శ్రీనివాస్ లతో పాటు, అవోపా జగిత్యాల జిల్లా శాఖ ప్రతినిధులు పెద్ది ఆనందం, రాజేషుని ఈశ్వరయ్య, పాత శ్రీనివాస్, ఎలాగందుల సుధాకర్, నూనె కుమార్, రాజేషుని జీవన్, దోంతుల నాగ భూషణం, భాషెట్టి హనూజ్, భాషెట్టి హరీష్, రాజేషుని శ్రావణ్ కుమార్, ఉటూరి మహేష్, దోంతుల వనజ లతో పాటు, కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమ నిర్వహణ శుభ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి రాజేషుని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల సేవలను గుర్తించి ప్రోత్సహించడం అవోపా లక్ష్యాలలో ఒకటని తెలుపుతూ.. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేసి, వారి సేవలు మరెందరికో స్ఫూర్తి దాయకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అవోపా కార్య వర్గం తరపున తమ కృతజ్ఞతలను తెలుపుతూ.. కార్యక్రమాన్ని ఉద్దేశించి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు.



# అర్హులందరికీ సీఎం సహాయ నిధి

## ఎమ్మెల్యే ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

## బైంసాలో 129 మందికి 36 లక్షల 13 వేల రూపాయల చెక్కుల పంపిణీ

నిర్మల్ జిల్లా ప్రతినిధి( వాయిస్ టుడే) అక్టోబర్ 04: రాజకీయాలకతీతంగా ప్రతి పేదవాడికి ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు .ఆదివారం బైంసాలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీ లో 129 మంది లబ్ధిదారులకు 36 లక్షల పదమూడు వేల రూపాయల చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటినుండి ఇప్పటివరకు ఐదువేల మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరిగిందన్నారు. పేదవాడు ఆసుపత్రిపాలై పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని అటువంటి సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కొంత ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. రాజకీయాలకతీతంగా ఎవ్వరైనా ముఖ్యమంత్రి సహాయనిధి కావాలంటే నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఇద్దరు సహాయకులు అన్నివేళలా అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, సీనియర్ నాయకులు సోలంకి భీమ్ రావ్, సర్పంచ్ ల సంఘం రాష్ట్ర కార్యదర్శి పండిత్ రావ్ పటేల్. బిజెపి పట్టణ మండలాల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మ రెడ్డి, యేశాల దత్తాత్రి, సాయన్న, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు అప్పాల రాకేష్, సాయినాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించిన ఘనత ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ దేనని చెప్పారు. ముధోల్ నియోజకవర్గం లో ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే పనిచేయని విధంగా సీఎంఆర్ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసి రాజకీయాలకతీతంగా చెక్కులు అందించడం అభినందనీయమన్నారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు తన కార్యకర్తలకు అనుచరులకు మాత్రమే చెక్కులు ఇచ్చేవారని, ప్రస్తుతం పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. విద్య, వైద్యం, సాగునీరు అందించడమే నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లు మాజీ ఎంపిటిసిలు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 05: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ కోరారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.జనాభాలో బీసీల వాటాకు అనుగుణంగా రాజకీయ అవకాశాలు కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు చొరవ చూపాలని కోరారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లతో పాటు చట్టసభల్లోనూ బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో బిల్లులు ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్లు ప్రకటించిందని తెలిపారు.రిజర్వేషన్లతో పాటు రాజకీయ ప్రాతినిధ్యం కూడా బీసీల అభివృద్ధికి కీలకమని అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించడం ద్వారా వారి సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీసీ అభ్యర్థులకు ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపులో ప్రాతినిధ్యం కల్పించే అంశంపై రాజకీయ పార్టీలు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా అన్ని పార్టీలు ముందుకు రావాలని ఎంబడి చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.